

విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

## ప్రజా సేవకుడిగా పనిచేస్తా

**● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

బొమ్మలరామారం, డిసెంబర్ 24 : ఆలేరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవకుడిగా పని చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని చీకటిమామిడిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీర్ల ఫౌండేషన్ ద్వారా ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. రాజకీయాలు మరిచి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మల్లి కృష్ణారెడ్డి, మహేశ్‌గౌడ్, రాజునాయక్, రాజేశ్వర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణంలోని బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ భరత్‌గౌడ్, నాయకులు బాలనర్సయ్య, భిక్షపతి పాల్గొన్నారు.



కొల్లూరులో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

## కొల్లూరులో సెమీ క్రిస్మస్ వేడుకలు

ఆలేరు రూరల్, డిసెంబర్ 24 : మండలంలోని కొల్లూరు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు జాన్, సదానందం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలన్నారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రగతిశీల యువజన సంఘం ప్రతినిధులు

## కేంద్రం నియంతృత్వ చర్యలను ఉపసంహరించుకోవాలి

**● ప్రగతిశీల యువజన సంఘం పట్టణ కార్యదర్శి శివ**

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 24 : కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేస్తూ నియంతృత్వ చర్యలకు పాల్పడిందని ప్రగతిశీల యువజన సంఘం పట్టణ కార్యదర్శి పగడాల శివ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్‌లో చోటు చేసుకున్న పొగ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటుకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. బీజేపీ వైఖరిని ఎండగడుతూ ప్రశ్నిస్తున్న 46 మంది ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని అఖిలపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద, ప్రజా వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు చెల్లా ధనరాజ్, దేవతల మహేశ్, సూరిబాబు, మహేశ్, నరసింహ పాల్గొన్నారు.

# సమాజ మార్పు, విలువల కోసం జీవించాలి

**● ప్రొఫెసర్ హరగోపాల్**

భువనగిరి అర్బన్, డిసెంబర్ 24 : సమాజ మార్పు, విలువల కోసం ప్రతి ఒక్కరూ జీవించాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు జైని మల్లయ్యగుప్తా ప్రథమ వర్ధంతిని పట్టణంలోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం లౌకిక ప్రజాస్వామిక విలువల ప్రతినిధిగా గుప్తా జీవించారని కొనియాడారు. ప్రస్తుతం కొన్ని రాజకీయ పార్టీలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మత విద్వేషాలను రెచ్చగొడుతూ ఎన్నికల్లో ప్రయోజనాలు పొందుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బట్టు రాంచంద్రయ్య, పోత్నాక్ ప్రమోద్‌కుమార్, కొలుపుల అమరేందర్, ఎస్ భాస్కర్, వెంకటేశ్, భువనగిరి శ్రీనివాస్, షేక్ హమీద్‌పాషా పాల్గొన్నారు.



మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

## 100 నాటు కోళ్లు చోరీ

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 24 : మండలంలోని కొరటికల్‌లో శనివారం రాత్రి నాటుకోళ్లు చోరీకి గురయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లగ్గాల సోమయ్య వ్యవసాయబావి వద్ద ఇంట్లో కోళ్లను ఉంచి గ్రామంలో ఇంటికి వెళ్లాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి అద్దాలను పగులగొట్టి సామాన్లతో పాటు 100 నాటు కోళ్లు దొంగిలించారు. సోమయ్య ఆదివారం ఉదయం వచ్చి చూడగా చోరీకి గురైన విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రాఘవాభారతి గ్రంథాలయం అధ్యక్షుడిగా రమేశ్



రమేశ్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 24 : మండలంలోని రాఘవాపురంలో ఏర్పాటు చేసిన రాఘవాభారతి గ్రంథాలయం అధ్యక్షుడిగా వంగాల రమేశ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా కాటం నరేశ్, ఉపాధ్యక్షులుగా ముషం సత్యనారాయణ, వంగాల శ్రావణ్, సహాయకార్యదర్శులుగా గోపయ్య, మహేశ్, కోశాధికారిగా బంటు తిరుమలేశ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## నేడు బొమ్మలరామారానికి గొంగిడి సునీత రాక

బొమ్మలరామారం, డిసెంబర్ 24 : మండలంలోని సోలిపేటలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయం ప్రారంభోత్సవానికి ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి రానున్నట్లు ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.



చల్లూరులో సమక్క గద్దె నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ వీరారెడ్డి

## ఫిబ్రవరి 21 నుంచి యాదాద్రి మేడారం జాతర

రాజాపేట, డిసెంబర్ 24 : మండలంలోని చల్లూరులో నెలకొల్పిన యాదాద్రి మేడారం సమ్మక్క సారక్క వనదేవతల జాతర ఫిబ్రవరి 21 నుంచి నిర్వహించనున్నట్లు సర్పంచ్ వంచ వీరారెడ్డి తెలిపారు. ఆదివారం యాదాద్రి చిన్నామేడారంలో సమక్క, సారక్క గద్దెల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదాద్రి పుణ్యక్షేత్రానికి అతి సమీపంలో సమక్క, సారక్క గద్దెలను నెలకొల్పామని, మేడారం పూజారులతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి వనదేవతలను దర్శించుకోవాలని కోరారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అన్నదానం ఉంటుందని తెలిపారు.



నూతనంగా ఎన్నికైన విశ్వకర్మసంఘం కమిటీ సభ్యులు

## విశ్వకర్మసంఘం గ్రామ కమిటీ ఎన్నిక

తుర్కపల్లి, డిసెంబర్ 24 : మహంకాళి విశ్వకర్మ సంఘం మండల కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూరెళ్ల గురవయ్య, గౌరవాధ్యక్షుడిగా తిప్పారం నరేశ్, ఉపాధ్యక్షుడిగా వెంకటాచారి, ప్రధాన కార్యదర్శిగా నరేశ్‌చారి, కోశాధికారిగా బాలకృష్ణ, కార్యదర్శిగా శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# చైతన్యంతోనే మోసాలకు చెక్

**హైకోర్టు అడ్వకేట్ అర్జున్**

మోత్కూరు, డిసెంబర్ 24 : ప్రజా చైతన్యంతోనే మోసాలకు చెక్ పడుతుందని హైకోర్టు అడ్వకేట్ పల్రెపాటి అర్జున్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. వ్యాపార, వాణిజ్య, ఇత ర అనేక రంగాల్లో ఏదో ఒక రూపంలో జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, అడ్వకేట్ చెరుకుపల్లి గోపాల్, మోత్కూరు డిఫెన్స్ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు గుమిడెల్లి పరశురాములు, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి అస్సందాస్, మత్స్యగిరి, రాజు, నరేశ్, కృష్ణ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు అడ్వకేట్ అర్జున్

## ఆర్థిక సాయం

వలిగొండ, డిసెంబర్ 24 : మండలంలోని మొగిలిపాక గ్రామానికి చెందిన షేక్ మౌలాబీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌రెడ్డి ఆదివారం కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జక్కల శంకరయ్య, భిక్షపతి, మొగిలిపాక రమేశ్, సత్యనారాయణ, భిక్షపతి, మదార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రానికి చెందిన ఉగ్గె భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. గ్రామస్తులు రూ.32వేలు, కాలనీవాసులు రూ.31వేలను ఆదివారం భిక్షపతి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్నాయికోడె నగేశ్, ఎంపీటీసీ యాస కవిత పాల్గొన్నారు.

## అదృశ్యమైన మహిళ మృతి



శారద(ఫైల్)

భువనగిరి అర్బన్, డిసెంబర్ 24 : అదృశ్యమైన మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డినాయక్‌తండాలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం రెడ్డినాయక్‌తండాకు చెందిన భూక్యా నరేశ్ భార్య శారద(25) ఈనెల 8న ఉదయం 10 గంటలకు దవాఖానకు పోయి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తుర్కపల్లి మండలం బద్దుతండాలో తల్లిగారింటికి వెళ్లి ఉండవచ్చని 15న తన బావమరిది లచ్చిరాంకు నరేశ్ ఫోన్ చేసి అడిగాడు. రాలేదని చెప్పడంతో భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో లచ్చిరాం ఫిర్యాదు చేశారు.ఆదివారం రెడ్డినాయక్‌తండాలో గల సురేంద్రపురి మామిడితోట యజమాని ఇంద్రసేనారెడ్డి బోరు వేయించే నిమిత్తం తోటకు వెళ్లగా శారద చెట్టుకు ఉరేసుకొని కన్పించింది. స్థానికులకు, భువనగిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వేణురెడ్డి

## మంగమ్మగూడెంలో వైద్య శిబిరం

అడ్డగూడూరు, డిసెంబర్ 24 : అడ్డగూడూరు ఆవాస గ్రామం మంగమ్మగూడెంలో అభయ మల్టీ స్పెషాలిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండీ వేణురెడ్డి మాట్లాడుతూ.. తన సొంత గ్రామంలో పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అభయ ట్రస్ట్ కో ఆర్డినేటర్ గోలి రామ్‌రెడ్డి, జహంగీర్, కడారి రమేశ్, మారిశెట్టి మల్లేశ్ పాల్గొన్నారు.